ఆకతాయిల ఆగడాలతో.. టెన్షన్



దక్షిణలో అల్లరి మూకల ఆగడాలు పెరిగిపోతున్నాయి. మద్యం మత్తులో కొందరు.. గంజాయి వంటి మాదక ద్రవ్యాలను సేవించి మరికొందరు రోడ్లపై విచక్షణారహితంగా ప్రవర్తిస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే భౌతికదాడులకు దిగి వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. బాధితులు ఎదురు తిరిగితే తమ స్నేహితులు, గ్యాంగ్‌లోని సభ్యులతో వచ్చి గొడవకు దిగుతున్నారు. ఇళ్ల ముందు వాహనాలను తిరగేసి, పాడు చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.

- గంజాయి, మద్యం సేవించి అల్లర్లు
- అడిగిన వారిపై దౌర్జన్యాలు
- ఇటీవల వాహనాలు ధ్వంసం చేసిన వైనం

అల్లిపురం: టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గొల్లలపాలెం దరి న్యూ పితానిదిబ్బలో కొంత మంది మత్తులో ఇళ్ల ముందు వాహనాలను తిరగేసి హంగామా సృష్టించారు. దీంతో వాహనాలు పాక్షికంగా దెబ్బ తిన్నాయి. ఈ హఠాత్ పరిణామానికి స్థానికులు ఆందోళన చెందారు. మహిళలు ఇబ్బంది పడ్డారు. టూటౌన్ పోలీసులకు సమాచారం అందజేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులు ఆంథోనీనగర్‌కు చెందిన వారిగా గుర్తించారు. వారిలో ఒకరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

గంజాయి విక్రయాలకు కేంద్రంగా : గొల్లలపాలెం జంక్షన్ గంజాయి విక్రయాలకు కేంద్రంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంజాయి చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్నారని పేర్కొంటున్నారు. వాటి కోసం ఎక్కడెక్కడి నుంచో ఆకతాయిలు వచ్చి కొనుగోలు చేస్తున్నారని, వారంతా స్థానికంగా గల గంగుల గెడ్డ బ్రిడ్జిపై తిష్ట వేసి సేవిస్తున్నారని తెలిపారు. అటువైపు మహిళలు ఒంటరిగా వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా వారిని అరెస్ట్ చేసి జైలుకు పంపించినప్పటికీ మళ్లీ బెయిల్‌పై వచ్చి వారి కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని వాపోతున్నారు.



న్యూ పితానిదిబ్బ కాలనీకి వెళ్లే దారిలో ఆకతాయిలు అస్తవ్యస్తంగా పడేసిన వాహనాలు

నిఘా ఏర్పాటు చేస్తే మంచిది

గొల్లలపాలెంలో ఆకతాయిల ఆగడాలు పెరిగిపోతున్నాయి. గంజాయి, మద్యం తాగి వచ్చి గొడవలు చేస్తున్నారు. పీకమీద కత్తులు పెట్టి మరీ బెదిరిస్తున్నారు. వారిని నిలదీస్తే దాడులకు కూడా వెనుకాడటం లేదు. వీరిపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేస్తే నివారించవచ్చు.

– **ఎన్.నారాయణరావు**, న్యూ పితానిదిబ్బ

ఒంటరిగా తిరగలేకపోతున్నాం

ఆడవాళ్లం ఒంటరిగా తిరగాలంటే భయంగా ఉంది. ఎప్పుడు ఎవరు వచ్చి ఏ గొడవ పెడతారో అని ఆందోళనకు లోనవుతున్నాం. ఇటీవల ఇంటి ముందు మొక్కల గోలాలు విరగ్గొట్టారు. ఏదీ ఇంటి ముందు పెట్టుకోలేక పోతున్నాం. శుక్రవారం ఇళ్ల ముందు వాహనాలను తిరగేసేశారు. చాలా బళ్లు దెబ్బతిన్నాయి.

– **జి.వరలక్ష్మి**, న్యూ పితానిదిబ్బ

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

ఈ ప్రాంతంలో సీసీ కెమెరాలు లేకపోవటంతో ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. పోలీసులు నిఘా ఏర్పాటు చేయాలి. తరచు పోలీసులు వస్తుంటే ఆకతాయిల ఆగడాలు తగ్గుముఖం పడతాయి. ఈ దిశగా చర్యలు తీసుకోవాలి. పోలీసులు కఠినంగా వ్యవహరిస్తే కొంతైనా పరిస్థితిలో మార్పు వస్తుంది.

– **ఆర్.అచ్యుతరావు**, గొల్లలపాలెం

చర్యలు తీసుకుంటాం

శుక్రవారం జరిగిన ఘటనలో ఇప్పటికే ఒకరిని అదుపులోకి తీసుకున్నాం. పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు ఇప్పటికే ప్రత్యేక బృందాలతో పర్యవేక్షిస్తున్నాం. స్థానికులు, సంఘాల వారితో సమావేశమై సీసీ కెమెరాల ఏర్పాటుపై చర్చించి తగిన చర్యలు తీసుకుంటాం.

– **బి.తిరుమలరావు**, సీఐ, టూటౌన్ పోలీస్ స్టేషన్

నేడు భువనేశ్వరీదేవికి అధివాసం



భువనేశ్వరీదేవి

దాబాగార్డెన్స్: యాతపాలెంలోని ఆరిపాక పంచాయతీ మణిపురంలో గల ఓం భువనేశ్వరీ సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం భువనేశ్వరీ దేవికి తెల్ల జిల్లేడు పత్రితో అధివాస మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆరాధనా పీఠం నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. భక్తులు అమ్మవారికి మంగళ స్నానం, దివ్య పంచామృతాలతో పాలు తదితర కర్పూరాది సుగంధ ద్రవ్యాలతో పూజలు నిర్వహించవచ్చని తెలిపారు.

10న వైకుంఠ ఏకాదశి



విశేష అలంకరణలో బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 16 నుంచి అత్యంత వైభవంగా ధనుర్మాసోత్సవాలు జరగనున్నాయి. ధనుర్మాసం మూడవ శనివారం సందర్భంగా బల్లిగిరి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, పాసుర పఠనం, గోదాదేవికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఈ నెల 10వ తేదీన వైకుంఠ ఏకాదశి, ఉత్తర ద్వార దర్శనం, 12వ తేదీన నీరాటోత్సవం, శ్రీనివాసులు, గోదాదేవిలను కల్యాణ దంపతులుగా అలంకరణ, 13వ తేదీ భోగి సందర్భంగా గోదా రంగనాథుల కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో జీవీ రమాబాయి తెలిపారు.

క్లుప్తంగా

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు వృద్ధులు



షెల్టర్ నిర్వాహకుడు వాసుతో వృద్ధురాలు

సీతమ్మధార: కుటుంబ సభ్యులు వద్దంటున్నా వినకుండా విశాఖ వచ్చేసి రైల్వేస్టేషన్‌లో భిక్షాటన చేస్తున్న ఇద్దరు వృద్ధులను ఏయూటీడీ ప్రతినిధి ప్రగడ వాసు వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. విజయనగరం జిల్లా ఎల్. కోట మండలం, జమ్మాదులపేటకు చెందిన గల్లా చల్లం నాయుడు (70), కొత్తవలస మండలం, రాజా కాలనీకి చెందిన స్వారంపూడి వసుంధర (65) కుటుంబ సభ్యులు వద్దంటున్నా వినకుండా వైజాగ్ వచ్చేసి రైల్వే స్టేషన్‌లో భిక్షాటన చేస్తూ అక్కడే ఉంటున్నారు. నవంబర్ 22వ తేదీన ఏయూటీడీ సిబ్బంది వీరిని గుర్తించి 40 రోజుల పాటు షెల్టర్‌లో ఉంచారు. ఈ అలవాటు మానుకోవాలని సూచించారు. విశాఖ నుంచి నేరుగా తీసుకుపోయి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



చెక్కు అందజేస్తున్న భక్తురాలు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థాన అన్నప్రసాద పథకానికి నగరానికి చెందిన ఎస్. వెంకట రమణి పద్మజ శనివారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయ ఈవో కె. శోభారాణికి శనివారం చెక్కు రూపంలో ఈ మొత్తం అందజేశారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆలయ వర్గాలు ఆమెకు ప్రసాదం అందించారు.

రేపు ఎన్‌ఏసీ కేంద్రంలో జాబ్ మేళా

మురళీనగర్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో మహారాణిపేట ఎన్‌ఏసీ కేంద్రంలో ఈనెల 6న జాబ్ మేళా నిర్వహిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో టీఏవో డిజిటల్ ఇండియా, సెల్ పాయింట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ, బి.టెక్ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ యువకులందరూ హాజరు కావచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులందరూ విశాఖపట్నం జిల్లాలో ఉద్యోగం చేయాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9676170026 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నైపుణ్యం వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని, స్పాట్ రిజిస్ట్రేషన్‌కు కూడా అవకాశం ఉందని తెలిపారు. అభ్యర్థులు ఆధార్, దాంతో అనుసంధానమైన ఫోన్ నంబర్‌తో హాజరు కావల్సి ఉంటుందన్నారు.

దక్షిణకు నేవీ కళ



బీచ్ వైపు సాగిపోతున్న జనం



ఆర్కే బీచ్‌కు తరలిపోతున్న వాహనాలు

దాబాగార్డెన్స్: నియోజకవర్గానికి నేవీ పండగ శోభ తెచ్చింది. నేవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్కే బీచ్‌లో విన్యాసాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకే బీచ్‌కు పలు ప్రాంతాల నుండి జనం క్యూ కట్టారు. దీంతో నియోజకవర్గం కిటకిటలాడింది. ఏ గల్లీ చూసినా వాహనాలతో కిక్కిరిసిపోయాయి. ముఖ్యంగా ఆర్కే బీచ్‌కు వెళ్లే అన్ని బస్సులు.. వాహనాలు ఆర్టీసీ కాంప్లెక్స్, జగదాంబ జంక్షన్, కలెక్టరేట్ మీదుగా వెళ్లడంతో ట్రాఫిక్ అనూహ్యంగా పెరిగింది.

తిరుగు ప్రయాణంలో ఇబ్బందులు..
నేవీ విన్యాసాలు చూసేందుకు వచ్చిన వీక్షకులు తిరుగు ప్రయాణంలో అవస్థలు పడ్డారు. లక్షలాది మంది ప్రజలు ఒక్కసారిగా తిరుగు ముఖం పట్టడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. అన్ని రహదారులు మూసుకుపోయాయి. వాహనాలన్నీ కలెక్టర్ కార్యాలయం వరకే నడిచాయి. అక్కడి నుంచి తిరుగుముఖం పట్టాయి. తిరుగు ప్రయాణంలో బస్సులన్నీ రద్దీగా వెళ్లాయి. సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు రద్దీ కొనసాగింది.

కిడ్నీ రోగులకు వాసుపల్లి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమం శూన్యమని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ విమర్శించారు. నియోజకవర్గంలో కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న ఇద్దరు పేషెంట్లకు రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయం చేశారు. అశోక్‌నగర్‌లో గల తన కార్యాలయంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. 27వ వార్డు దొండపర్తికి చెందిన దల్లి శ్రీనివాస్ లివర్, కిడ్నీ సమస్యతో గత కొన్ని నెలలుగా ఇబ్బంది పడుతున్నాడని, అలాగే ఆశీల్‌మెట్ట ప్రాంతానికి చెందిన ఎల్లపిల్లి జ్యోతి కూడా కిడ్నీ సమస్యతో ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకున్న వాసుపల్లి వారిద్దరికీ ఆర్థిక సాయం చేశారు. సంక్షేమం, అభివృద్ధిని గాలికి వదిలేసిన చంద్రబాబు డాబు మాటలతో మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగనన్న హయాంలో వార్డు సచివాలయాల ద్వారా రూపాయి అవినీతి లేకుండా ప్రభుత్వ పనులు నిర్వహించే వారని, కానీ నేడు ప్రతి ప్రభుత్వ సర్టిఫికెట్‌కు లంచాలు లేకుండా పని జరగడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అమ్మాజీ, వార్డు నాయకుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, పీతల వాసు, బోరా విజయలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, పాటోజు అర్జున్ ప్రసాద్, మూగడ రాజేష్, గనగళ్ల రామరాజు, చింతకాయల వాసు, చేపల రాజు తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సంపద అభివృద్ధికి చర్యలు



అధికారులతో మత్స్యశాఖ కమిషనర్ దోలా శంకర్

మహారాణిపేట: రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ టి.డోలా శంకర్ శనివారం కేంద్రీయ మత్స్య పరిశోధన సంస్థలైన సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీఎంఎఫ్ఆర్ఐ), సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ (సీఐఎఫ్‌టీ)లను సందర్శించారు. ఈ సందర్భంగా సీఎంఎఫ్ఆర్ఐ శాస్త్రవేత్తలతో సమావేశమై రాష్ట్రంలోని తీర ప్రాంతంలో చేపల పెంపకం, ఇతర మత్స్య సంపదపై చర్చించారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా మత్స్యకారులకు ఉపాధి కల్పనకుగాను ప్రభుత్వం సీకేజ్ పెంపకం, సీవీడ్ పెంపకాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. రొయ్య పిల్లల ఉత్పత్తి కేంద్రాలు, చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాల్లో చిరు చేపలు, రొయ్యలకు ఆల్గే, రోటిఫెర్ లైవ్ ఫీడ్ ఉత్పత్తి కోసం సీఎంఎఫ్ఆర్ఐలో ప్రయోగాత్మకంగా చేపడుతున్న ఎపినేపిలిస్ పిల్లల పెంపక యూనిట్లు తనిఖీ చేశారు. రాష్ట్రంలో రైతులు, నిరుద్యోగులకు శిక్షణ, యూనిట్ల స్థాపన కోసం చర్చించారు. తీరజలాల్లో ఆర్టిఫిషియల్ రీఫ్స్ ఏర్పాటు అవకాశాలపై చర్చించారు. ఆర్టిఫిషియల్ రీఫ్స్ ఏర్పాటు వల్ల సముద్రంలో చేపల బ్రీడింగ్, ఆవాసానికి అనుకూలత ఏర్పడి భవిష్యత్తులో మత్స్య సంపద ఉత్పత్తి పెరగడానికి అవకాశం ఉందన్నారు. దీని ద్వారా మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపడుతుందని వివరించారు. తదుపరి సీఐఎఫ్‌టీని సందర్శించి శిక్షణ కార్యక్రమాలు, విస్తరణపై చర్చించారు. అనంతరం తిమ్మాపురం మహిళా మత్స్యకార సంఘం డ్రై ఫిష్ యార్డులో వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు పి.లక్ష్మణరావు, ఎస్ఐఎఫ్‌టీ అడిషనల్ డైరెక్టర్ టి.సుమలత, సీఐఎఫ్‌టీ శాస్త్రవేత్తలు శ్రీధర్, మధుసూదనరావు, మత్స్య సహాయ సంచాలకులు విజయకృష్ణ, కిరణ్‌కుమార్, మత్స్యశాఖ స్థానిక అధికారులు శేఖర్, మురళి, డాక్టర్ గోపి, నాగబాబు, మహిళా మత్స్యకార సంఘం ప్రెసిడెంట్ మారుపల్లి పార్వతమ్మ, డీపీఎం డాక్టర్ పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి

సీతంపేట : అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహాత్ముడు లూయిస్ బ్రెయిలీ అని ఎంఈవో బాలామణి అన్నారు. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ పాఠశాల ఆవరణలో గల భవిత సెంటర్‌లో శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా జీవీఎంసీ హైస్కూల్ హెచ్ఎం లక్ష్మీ నరసతో కలిసి బ్రెయిలీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దృష్టి లోపం ఉన్నవారికి చదవడానికి, రాయడానికి వీలుగా ప్రత్యేక లిపిని బ్రెయిలీ ఆవిష్కరించారని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా బ్రెయిలీ లిపి గుర్తింపు పొంది, నేటికీ ఉపయోగిస్తున్నారని కొనియాడారు కార్యక్రమంలో భవిత టీచర్ జగదాంబ, దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చైతన్య శిఖరం సావిత్రిబాయి పూలే



మాట్లాడుతున్న ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు



సావిత్రి బాయి పూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న జైభీమ్ కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: చైతన్య శిఖరం సావిత్రిబాయి పూలే అని డాక్టర్ లలిత కొనియాడారు. సావిత్రిబాయి పూలే 194వ జయంతిని శనివారం నగరంలోని జైభీమ్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు మాట్లాడుతూ సూద్ర కులాలకు, స్త్రీలకు విద్య నేర్పి, సమాజ మార్పునకు పునాదులు వేశారని తెలిపారు. బాల్య వివాహాల నిషేధం, వితంతువుల పరిరక్షణకు సావిత్రిబాయి పూలే కృషి చేశారని పేర్కొన్నారు. దేశ తొలి మహిళా ఉపాధ్యాయిని అని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ లలిత, పతివాడ రాంబాబు, డాక్టర్ రమేష్‌బాబు, కంట్రెడ్డి రామన్నపాత్రుడు, ఎస్ఆర్ వేమన, జైభీమ్ కన్వీనర్ కోన ప్రకాష్, పాటలతూటా ఉదయ్‌భాస్కర్, భూపతిరావు, ఈశ్వర్, డాక్టర్ రమ్య, కోన శంకర్, దీపిక తదితరులు పాల్గొన్నారు.

ఏవీఎన్ కళాశాలలో..
ఏవీఎన్ కళాశాలలో సావిత్రిబాయి జయంతి శనివారం నిర్వహించారు. కళాశాల మహిళా విభాగం, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు మాట్లాడారు. మహిళల విద్యకు సావిత్రిబాయి పూలే ఎనలేని కృషి చేశారని, అందుకు గుర్తింపుగా ఈ రోజు మనమందరం స్టేట్ ఉమెన్ టీచర్స్ డేగా జరుపుకుంటున్నామని చెప్పారు. ప్రతి మహిళ సావిత్రిబాయి పూలే సేవలు స్ఫూర్తిగా తీసుకుని అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల మహిళా విభాగం అధ్యక్షురాలు భానుమతి, ఉపాధ్యక్షురాలు డాక్టర్ అర్చన, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్, పలువురు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఏవీఎన్‌లో జాతీయ యువజన దినోత్సవం..
ఏవీఎన్ కళాశాలలో జాతీయ యువజన దినోత్సవం శనివారం నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయానికి చెందిన రిసోర్స్ పర్సన్ రోజా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. యువతకు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ అర్చన, రామ్‌కుమార్, కె. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొట్టిన లారీ



సిమెంట్ దిమ్మల పైకి దూసుకుపోయిన కారు

సీతమ్మధార : సత్యం కూడలిలో శనివారం తెల్లవారుజామున కారును లారీ ఢీకొట్టింది. ఈ ఘటన ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సీతమ్మధార ప్రాంతానికి చెందిన ఒక కుటుంబం కారులో శనివారం తెల్లవారుజామున రామాటాకీస్ నుంచి సీతమ్మధార వైపు వస్తున్నారు. అటుగా గురుద్వార్ నుంచి మద్దిలపాలెం వైపుగా వెళ్లే లారీ సిగ్నల్ చూడకుండా సత్యం కూడలి దాటుతున్న కారును బలంగా ఢీకొట్టడంతో పక్కనే ఉన్న సిమెంట్ దిమ్మలపైకి దూసుకుపోయింది. అదృష్టవశాత్తు కారులో ఉన్న నలుగురూ సురక్షితంగా బయటపడ్డారు. ద్వారకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిరు వ్యాపారులకు స్థలం కేటాయించాలి



స్థానికులతో మాట్లాడుతున్న జోన్ - 5 కమిషనర్ రాము

మద్దిపాలెం : జీవీఎంసీ 53వ వార్డు పరిధి గ్రీన్ బెల్ట్ ప్రాంతాన్ని జోన్ – 5 కమిషనర్ బి.రాము శనివారం సందర్శించారు. ఇటీవల గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో చిరు వ్యాపారుల దుకాణాలు తొలగించడంతో వారికి ప్రత్యామ్నాయంగా మరో చోట స్థలం కేటాయించాలని టీడీపీ నాయకుడు పోలమరశెట్టి శ్రీనివాసరావు ఇటీవల కోరారు. ఈ నేపథ్యంలో జెడ్సీ పర్యటించారు. గత 50 ఏళ్లుగా ఇదే ప్రాంతంలో వారంతా చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, వారికి ప్రత్యామ్నాయ స్థలం కేటాయించాలని నాయకులు కోరారు. ఈ విషయమై కమిషనర్ సానుకూలంగా స్పందించి విషయాన్ని జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అలాగే గ్రీన్ గార్డెన్స్ రెసిడెన్సియల్ ప్రాంతంలో పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నారని స్థానికులు ఆయనకు వివరించారు. వెంటనే ఆ ప్రాంతాన్ని ఆయన సందర్శించి ఆ పరిశ్రమకు సంబంధించిన అనుమతులు తనిఖీ చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అప్పటి వరకు పనులు చేపట్టవద్దని పరిశ్రమ నిర్వాహకులకు సూచించారు. పనులు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

బడ్డీ తొలగింపు అన్యాయం



రామకృష్ణానగర్‌లో బడ్డీ ఎదుట నిరసన చేపడుతున్న బాధితులు

సీతంపేట : బతుకుతెరువు కోసం రోడ్డు పక్కన బడ్డీ పెట్టుకుని జీవనం సాగిస్తున్న వారిని కూడా కూటమి నాయకులు వదిలిపెట్టడం లేదు. జీవీఎంసీ 26వ వార్డు రామకృష్ణానగర్‌లో రామలింగేశ్వరాలయం గోడ పక్కన గత 16 ఏళ్లుగా ఒక వ్యక్తి బడ్డీలో వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. చెక్క బడ్డీ శిథిలం కావడంతో కొద్ది నెలల కిందట దాని స్థానంలో ఐరన్ బడ్డీ ఏర్పాటు చేసుకున్నాడు. అయితే ఆ వార్డు కార్పొరేటర్ సోదరుడు ఆ స్థలాన్ని తన అనుచరుడికి కేటాయించానని, వెంటనే అక్కడ ఉన్న బడ్డీ తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. జీవీఎంసీ సిబ్బంది శనివారం ఉదయం బడ్డీ తొలగించడానికి వెళ్లడంతో స్థానికులంతా కలిసి అడ్డుకున్నారు. 16 ఏళ్లుగా ఉన్న బడ్డీ తొలగించి, ఆ స్థలాన్ని వేరే వారికి అప్పగించడం అన్యాయమని ప్రశ్నించారు. తొలగిస్తే అందరివీ తొలగించాలి కానీ, ఒక్క బడ్డీ తొలగించడం సరికాదని, కార్పొరేటర్ సోదరుడు తీరు పట్ల స్థానికులంతా బడ్డీ ఎదుట నిరసన చేపట్టారు. విషయాన్ని జోనల్ కమిషనర్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు దృష్టికి తీసుకెళ్తామని బాధితుడు తెలిపారు.

స్పీడ్ బ్రేకర్ల నిర్మాణం

సీతంపేట : బుల్లయ్య కళాశాల రోడ్‌లో వాహనాల వేగ నియంత్రణకు రెండు వైపులా స్పీడ్ బ్రేకర్లు నిర్మించారు. సత్యం సెంటర్ నుంచి రామాటాకీస్ కూడలి వైపు, అలాగే రామాటాకీస్ కూడలి నుంచి సత్యం సెంటర్ వైపు వాహనాలు వేగంగా దూసుకొస్తుండడంతో ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నియంత్రణకు ఎప్పటి నుంచో ఈ మార్గంలో స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలని డిమాండ్ ఉంది. ప్రస్తుతం అది కార్యరూపం దాల్చడంతో సమస్య పరిష్కారమైందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.